ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 16.01.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధించి పలు అంశాలను చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీలో కేంద్రమంత్రులతో సమావేశమవుతున్నారు.
2. అంకుర పరిశ్రమ వ్యవస్థ 9వ వార్షికోత్సవాన్ని ఈ రోజు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ పరిశ్రమను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
3. కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళుల అర్పిస్తున్నారు.
4. యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో గత 24 గంటల్లో జరిగిన రెండు వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మరణించారు. ఏడుగురు గాయపడ్డారు.

--------------------------------

**సీఎం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు కేంద్రమంత్రులతో సమావేశమవుతున్నారు. రాష్ట్రానికి అవసరమైన ప్రాజెక్టుల మంజూరు, అభివృద్ధి

పనులకు నిధులు వంటి అంశాలపై చర్చిస్తున్నారు. అనంతరం ఆరు రోజుల సింగపూర్ , దావోస్ పర్యటనకు బయలుదేరి వెళతారు. సింగపూర్ లో పారిశ్రామిక వేత్తలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్టేడియాల నిర్మాణానికి సంబంధించి న అంశాల అధ్యయనానికి సింగపూర్ క్రీడా విశ్వ విద్యాలయాన్ని సందర్శిస్తారు. అనంతరం స్విట్జర్ లాండ్ లోని దావోస్ లో ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో పాల్గొంటారు. తెలంగాణకు పెట్టుబడులు రాబట్టేందుకు ముఖ్యమంత్రి ప్రపంచ నేతలు, వాణిజ్య ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

**PN**

------------------------------

## M-STARTUP INDIA

దేశంలో అంకుర పరిశ్రమ సంస్కృతిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ రోజు స్టార్టప్ ఇండియా 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సందేశం ఇస్తూ, గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రభుత్వం ఎంతో మంది యువతకు సాధికారత కల్పించిందని, వారి వినూత్న ఆలోచనలను విజయవంతమైన అంకుర పరిశ్రమలుగా మార్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు 'సులభంగా వ్యాపారం చేయడం', వనరులను వినియోగంలోకి తీసుకొచ్చి స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడంపై దృష్టి సారించాయని ప్రధానమంత్రి అన్నారు. యువతలో ఉత్సాహం నింపేందుకు

ప్రభుత్వం ఆవిష్కరణ ఇంక్యుబేషన్ కేంద్రాలను ప్రోత్సహిస్తోందని మోదీ అన్నారు.

**NSD**

-----------------------

**స్టార్టప్ లు:**

అంకుర పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎనిమిదేళ్ళ క్రితం చేపట్టిన చర్యల ఫలితంగా ప్రస్తుతం దేశంలో అంకుర పరిశ్రమల సంఖ్య లక్షా 54 వేలను మించింది. స్టార్టప్ లను ప్రోత్సహించే శక్తిమంతమైన వ్యవస్థ ఏర్పాటుకు 2016 లో ఇదే రోజున కేంద్ర ప్రభుత్వం స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టింది. క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్, పన్ను మినహాయింపులు, స్టార్టప్ బ్రిడ్జెస్ లాంటి పలు పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది.

ఫలితంగా గత ఏడాది నవంబరునాటికి దేశంలో 36 రాష్ట్రాలలో లక్షన్నర పైగా స్టార్టప్ ల ద్వారా 17 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభించింది. 48 శాతం స్టార్టప్‌లలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉండటం విశేషం. పెద్ద సంఖ్యలో 27 వేల స్టార్టప్‌లతో మహారాష్ట్ర ముందంజలో ఉండగా, తెలంగాణా లో కూడా స్టార్టప్పులకు గణనీయమైన ప్రోత్సాహం లభిస్తోంది. స్కైరూట్ ఏరోస్పేస్ మొదలైనప్పటి నుంచీ VIKRAM సిరీస్‌తో ప్రైవేట్ స్పేస్ టెక్ రంగంలో గణనీయమైన ఫలితాలు సాధించి, ఆవిష్కరణల రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తోంది. ఆటోక్రసీ మెషినరీ పేరుతో మొదలయిన స్టార్టప్ వ్యవసాయం అనుబంధ రంగాల కోసం ప్రత్యేక పరికరాలను అభివృద్ధి చేస్తూ, 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తిని ప్రతిబింబిస్తోంది.

**MSL**

---------------------

**జైపాల్ రెడ్డి జయంతి**

కేంద్ర మాజీ మంత్రి S జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులు  అర్పిస్తున్నారు.  హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు వద్ద  స్ఫూర్తి స్థల్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెసు నాయకులు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి పాత్రను, కేంద్ర సమాచార ప్రసార శాఖ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రిగా ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ గా జైపాల్ రెడ్డి సేవలు స్ఫూర్తి దాయికం అనీ, ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలనీ ఈ సందర్భంగా పలువురు నాయకులు పిలుపునిచ్చారు.   కాగా కాంగ్రెసు పార్టీ కార్యలయం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జయపాల్ రెడ్డి చిత్రపటానికి పూల దండలు వేసి ఆ పార్టీ  నాయకులు నివాళి అర్పించారు.

**MSL**

-------------------------------------

**కేటీఆర్ ఫార్ముల – ఈ రేసు కేసు**

ఫార్ముల – ఈ రేసు కేసులో ఆర్థిక అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ఈ ఉదయం హైదరాబాద్ లోని ఎకనామిక్ డైరెక్టరేట్ ఆఫీస్ విచారణ నిమిత్తం హాజరయ్యారు.

ఈడీ అధికారులు ఈ కేసుకు సంబంధించి ఆయనను విచారిస్తున్నారు. ఈ కేసులో తారక రామారావు ఏ1 ముద్దాయిగా ఉన్నారు. ఇప్పటికే సీనియర్ ఐఏఎస్ అదికారి మాజీ హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్, మాజీ హెచ్ ఎండీ ఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ ఎన్ రెడ్డిని ఈడీ విచారించింది.

**SDP**

------------------------

**డ్రైనేజీ పనుల-డ్రోన్ సర్వే**

గ్రేటర్ వరంగల్ నగరంలో భూగర్భ డ్రైనేజీ పనుల కోసం నిర్వహిస్తున్న డ్రోన్ సర్వేను మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే ఈ రోజు పరిశీలించారు. భూగర్భ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా నగరంలో ఎంపిక చేసిన చెరువుల సమీపంలో సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. లైన్లను ఏర్పాటు చేసి మురికి నీటిని ఎస్టీపీలకు తరలించి శుద్ధి చేయిస్తామని తెలిపారు.

**పీటీసీ...వరంగల్**

---------------------

**బర్డ్ వాచ్**

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ డివిజన్ పరిధిలో రేపటి నుంచి మూడు రోజుల పాటు బర్డ్ వాచ్ నిర్వహించనున్నట్లు కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారి సుశాంత్ సుఖదీర్ తెలిపారు. కాగజ్ నగర్, సిర్పూర్ (టి), పెంచికలపేట, బెజ్జూర్ మండలాల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో దీనినిన నిర్వహించనున్నట్లు

తెలిపారు.2019, 2022లో బర్డ్ వాచ్ నిర్వహించగా, 2019లో 350 రకాల పక్షులను గుర్తించారు.

**పీటీసీ...ఆసిఫాబాద్**

--------------------------------

**వాహనాల రద్దీ**

హైదరాబాద్ నుంచి సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణమైన నేపథ్యంలో రహదారులు వాహనాలతో కిక్కిరిసి పోయాయి. ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో సొంత వాహనాలపై తిరిగి వస్తున్నారు. దీంతో జాతీయ రహదారులపై వావానాల రద్దీ పెరిగింది. దీంతో టోల్ ప్లాజాలు, జాతీయరహదారిపై ప్రమాదకర మలుపుల వద్ద పోలీసులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద మొత్తం 16 బూత్ లలో పన్నెండు హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు కేటాయంచారు. గుంటూరు, మాచర్ల హైవేల మీద కూడా ట్రాఫిక్ సాధారణంకన్న ఎక్కువగా ఉంది.

**పీటీసీ..నల్గొండ/డెస్క్**

----------------------------

**గడ్కరీ**

జాతీయ రహదారులపై టోల్ గేట్ల వద్ద ప్రైవేట్ వాహనాలకు నెల, వార్షిక వారీ పాస్ లు ప్రవేశపెట్టే ప్రతిపాదన పరిశీలనలో ఉందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. టోల్ ఆదాయంలో వాణిజ్య వాహనాల నుంచి 74 శాతం మేర వస్తుందన్నందున పాస్ ల జారీకి ఆలోచిస్తున్నామని చెప్పారు.

గ్రామీణుల రాకపోకలకు అంతరాయం కలుగకుండా టో వసూలు కేంద్రాలను గ్రామాలకు ఆవతల ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు గడ్కరీ చెప్పారు.

డెస్క్

-----------------------

**రోడ్డు ప్రమాదాలు**

యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గత 24 గంటల్లో జరిగిన రెండు వేరువేరు రహదార ప్రమాదాల్లో ఆరుగురు మరణించారు. ఏడుగురు గాయపడ్డారు. యాద్రాద్రి భువనగిరి జిల్లా రాయగిరి వద్ద ఈ ఉదయం ఆగి ఉన్నలారీని కారు ఢీకొనడంతో కారులోని తల్లీకూతురు అక్కడికక్కడే మరణించారు. కారు నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా, వెనుక సీట్లలోని నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల పరిధిలోని వేపూర్ గ్రామ వద్ద నిన్న సాయంత్రం కారు –ఆటో ఢీకొని ఆటోలోని ప్రయాణికులు నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నాగర్‌కర్నూల్ వైపు అతివేగంగా వస్తున్న కారు తోటపల్లి నుంచి కల్వకుర్తి వెళుతున్న ఆటోను ఢీకొందని పోలీసులు తెలిపారు. మృతులు తోటపల్లికి చెందిన వారు.

**పీటీసీ.... యాదాద్రి భువనగిరి / నాగర్‌కర్నూల్**

-------------------------------